# భారతీయ జనతా పార్టీ - తెలంగాణ
**BHARATIYA JANATA PARTY**
**Telangana**
www.bjptelangana.org

Dr. Shyamaprasad Mukherjee Bhavan
Opp: Exhibition Grounds
Nampally, Hyderabad -500 001.
✆: 040-24653311, 24653535
Fax: 040-24653929
e mail:**bjptgonline@gmail.com**


తేది: 10.07.2017

## పత్రికా ప్రకటన

రాష్ట్రంలో టిఆరెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి లక్షలాది మంది నిరుద్యోగ యువతను మభ్యపెట్టి, వారి తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురిచేయడం తీవ్ర విచారకరమని, యువమోర్చా కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పెద్దఎత్తున ఉద్యమాలను చేపట్టి యువతపక్షాన పోరాడాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డా॥ కె. లక్ష్మణ్ పిలుపునిచ్చారు.

బిజెపి యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు నేడు హైదరాబాద్‌లోని చందానగర్ క్రిష్టల్ గార్డెన్స్‌లో జరిగాయి. యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ గుండగోని భరత్ గౌడ్ అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా॥ కె. లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్రంగా స్పందిస్తూ ఇదిగో, అదిగో ఉద్యోగాలంటూ అరచేతిలో వైకుంఠం చూపట్టే ప్రయత్నం చేస్తున్నారని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిరుద్యోగ యవతపట్ల ఉ త్తుత్తి కమిషన్‌గా తయారైందని ఆయన విమర్శించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం యువత సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నది. 'స్కిల్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా', 'స్టాండప్ ఇండియా' లాంటి పథకాలతో కోట్లాది మంది యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తున్నదని; కేంద్ర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాల భర్తీని యుద్ధ ప్రాతిపదికపై భర్తీ చేస్తున్నదని; ముద్రా బ్యాంకు ద్వారా కోట్లాది మందికి రుణ సౌకర్యం కల్పిస్తూ సొంతంగా వ్యాపార అభివృద్ధికి కృషిచేస్తున్నదని డా॥ లక్ష్మణ్ తెలిపారు.

కేంద్రంలో నీతివంతమైన ప్రభుత్వం నడుస్తుండగా, రాష్ట్రంలో దీనికి విరుద్ధంగా అవినీతి పాలన కొనసాగుతున్నది. తెలంగాణ ఉద్యమం సందర్భంగా 'నిధులు- నీళ్లు- నియామకాలు'తో బంగారు తెలంగాణ ఏర్పాటు చేస్తామని, నిరుద్యోగ యువతకు హామీలిచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నదని; నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేయడమే బంగారు తెలంగాణానా అని డా॥ లక్ష్మణ్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి స్వయంగా శాసనసభ సాక్షిగా ఖాళీగా ఉన్న లక్షా ఏడువేల ఉద్యోగాలను వెంటనే భర్తీచేస్తామని హామీ ఇచ్చినా, ముఖ్యమంత్రి చేసిందేమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో 77 కార్పొరేషన్లలో ఉద్యోగ కల్పన ఏమైందని, అనేక సంవత్సరాలుగా డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు లభిస్తాయని ఆశించిన వారికి గ్రూప్-2 ఉద్యోగాలు, పోలీసు కానిస్టేబుల్, ఎస్.ఐ. ఉద్యోగాలు, కళాశాల అధ్యాపకులు, విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్ల ఉద్యోగాలతోపాటు ఖాళీగా గురుకుల పాఠశాల టీచర్ల ఖాళీలు ఉన్నాయని ఫలితంగా ప్రాథమిక విద్యాస్థాయి నుండి విశ్వవిద్యాలయాల వరకు నాణ్యమైన విద్య కొరవడిందని విద్యార్థులు తీవ్ర ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు.

పరీక్షలు సక్రమంగా నిర్వహించడంలో టిపిఎస్సీ పూర్తిగా వైఫల్యం చెందిందని, ప్రశ్నాపత్రాలు తప్పుల తడకలుగా ఉండటం వల్ల ఉద్యోగార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీచేయాలని డా॥ లక్ష్మణ్ కోరారు.

నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై బిజెపి యువమోర్చా ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ భరత్ గౌడ్ తెలిపారు.

**కార్యాలయ కార్యదర్శి**